
వారం రోజుల నుంచి-
ఏ రోజు కారోజే రమణ వస్తాడేమోనని ఎదురుచూస్తున్నాను. అతను వచ్చిన వెంటనే, ఈ శుభవార్త అతనికి చెప్పి, ఆనంద భరితుణ్ని చేద్దామనుకుంటున్నాను.

ఈ ప్రపంచంలో ఎవరికైనా అన్నింటికన్నా అందమైన పదం వాళ్ళ పేరు. దాన్ని అచ్చులో చూసుకోవడం, అందులోను 'రచయిత'గా చూసుకోవడం వర్ణనాతీతమైన ఆనందం. ప్రసవవేదనని మరిచిపోయి పండంటి బిడ్డకి జన్మనిచ్చిన తృప్తితో, తన్మయం చెందే తల్లి పొందే అపురూప అద్వితీయ అనుభూతి లాంటిదది.



# అమ్మకథ

ఆకెళ్ళ శివప్రసాద్

దాదాపు ఏడాది నుంచి భగీరథ ప్రయత్నం చేసిన రమణ కోరిక ఇన్నాళ్ళకు నెరవేరింది. అతను రాసిన కథ అచ్చులోకి వస్తోంది.

ఆరోజు నాకింకా గుర్తు...

ఆఫీసులో ఏదో ట్రాన్స్‌లేషన్ చేసుకుంటున్నాను.... 'స్కామ్' అనే పదానికి తెలుగుపదమేమిటో అని చండ ప్రచండంగా వెతుకుతున్న సమయంలో-

''...నమస్తే సార్...'' అన్న కంఠం విన్పించింది.

''.... నమస్తే ....'' విసుగ్గా చూశాను. సాయంత్రానికి ట్రాన్స్‌లేషన్ ఇవ్వాలి. ఎదురుగా ఇంతకు ముందెప్పుడూ చూడని వ్యక్తి. రెండు నిముషాలు ఏమీ మాట్లాడలేదు. అతని వయసు సుమారు పాతిక ఉండొచ్చు, కానీ అంతకన్నా ఎక్కువ వయసు ఉన్నట్టు కన్పిస్తున్నాడు. నల్లగా, బక్క పలచగా ఉన్నాడు. మంద్ర స్వరంలో, సిగ్గుపడ్తున్నట్టు-

''... సార్... నేనో కవిత రాశానండి....'' అంటూ భుజానికున్న బ్యాగ్‌లోంచి ఓ పుస్తకాన్ని లాగి, అందులోంచి ఓ కాగితం అందించాడు. విషయం అర్థమైంది. కవిత నందుకుని-

''...ఓ.కే.... పరిశీలిస్తామ్...'' అన్నాను. అతను కదల్లేదు.

''... ఎప్పుడు రమ్మంటారు సార్ ...?'' వినయంగా అడిగాడు.

''... మీరు రావలసిన అవసరం లేదు. ప్రచురణకి స్వీకరిస్తే మేమే తెలియజేస్తాం....'' అన్నాను డిక్షనరీ తిరగేస్తూ....

''...నేనుంటున్నది ఇక్కడి దగ్గరే సార్... నేనేవస్తాను...'' అన్నాడు.

''...నరే... ఓ వారం రోజుల తరువాత రండి...'' అంటూ పనిలో మునిగిపోయాను. ఐదు నిముషాల తరువాత-

''... సారీ సార్...'' నొచ్చుకున్నట్టు మొహం పెట్టాడు చికాగ్గా చూస్తున్న నన్ను చూస్తూ. ఈసారి చేతిలో నాలుగైదు పేజీలు కన్పించాయి.

''... ఓ చిన్న కథ కూడా రాశానండి....'' అంటూ కాగితాలు అందించాడు. కథ అందుకుని-

''... వారంలో రండి....'' అని, అక్కడే కనిపిస్తే ఓ 'నవల'ని చేతిలో పెడ్తాడేమోనని భయపడి, ఏదో పనున్నట్టు పక్క గదివైపు కదిలాను. అతను వెళ్ళిపోయాడు.

వారం తరువాత అతను వచ్చినా, పనుల వత్తిడి వల్ల అతని రచనలు చదవే అవకాశం దొరక లేదు.

''... సారీయండి... ఇంకా చూడలేదు. మరో రెండు రోజుల్లో చదువుతాను...'' అన్నాను.

మరో రెండు రోజుల తరువాత వచ్చాడు. ప్రత్యేక సంచిక హడావిడిలో ఉండడం వల్ల చదవలేదు. మరో సారి రమ్మంటే బాగోదని, అతన్ని కూర్చోపెట్టి, చదవడం ప్రారంభించాను. రాత గజిబిజిగా ఉండడం వల్ల చదవడం కష్టంగా ఉంది. ఎలాగైతేనేమ్ చదవడం పూర్తి చేశాను. కవిత బాగోలేదు. కథ కూడా పెద్దగా నచ్చలేదు.

''... సారీయండి... మీరేమీ అనుకోకపోతే...'' అంటూ ఈ కథ, కవితా మా పత్రిక అభిరుచికి అనుగుణంగా లేకపోయినప్పటికీ, వేరే పత్రికలకి పంపించి ప్రయత్నించమని చెప్పాను. అతని కళ్ళలో బాధ స్పష్టంగా కన్పించింది. భారంగా వెళ్ళిపోయాడు.

ఆ తరువాత-

మళ్ళీ రెండు కవితలు, రెండు కథలు తీసుకువచ్చాడు. వాటిని నవ్వుతూనే నచ్చలేదని చెప్పేశాను. పట్టువదలని విక్రమార్కుడిలా వారం రోజులకోసారి ఏదో ఒకటి తీసుకు వస్తూనే ఉన్నాడు.

నెల రోజులు గడిచాయి.

ఈకాలంలో మా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. రచనల ద్వారా 'రమణ' అని పేరు తెలిసింది. ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఈ పట్టణానికి వచ్చానని చెప్పాడు. ఈ ఊరికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూరు వాళ్ళది. మంచి రచనలు రావాలంటే మంచి పుస్తకాలు విరివిగాక చదవాలని, తెలుగు సాహిత్యంలో కలకాలం నిలిచిపోయే కొన్ని రచనలు చదవవలసిందిగా సూచించాను.

''... ఎక్కువగా చదవడం వల్ల ఎలా రాయాలో తెలీడమే కాక, ఎంత బాగా రాయొచ్చు కూడా తెలుస్తుంది...'' అన్నాను. ఆ తరువాత నాలుగు రోజులకి నాదగ్గరికి వచ్చి అతను చదివిన, చదువుతున్న పుస్తకాల గురించి చెప్పాడు.

రమణ నిరుద్యోగి అని చెప్పడంతో, అతనికి సహాయం చేసే ఉద్దేశ్యంతో అవకాశం దొరికినప్పుడల్లా చిన్న చిన్న పేరాలు ట్రాన్స్‌లేషన్ చేసుకుని రమ్మంటున్నాను. అవసరమనేది మనిషికి శ్రద్ధ నిస్తుంది. ట్రాన్స్‌లేషన్ బాగా చేస్తున్నాడు. అనువాదాల ద్వారా వచ్చి పారితోషికాన్ని ఉద్యోగాలకు అప్లయ్ చేయడానికి ఉపయోగిస్తున్నట్టు చెప్పారు.

వారం క్రితం నా దగ్గరికి వచ్చిన, రమణ ఎందుకో నిర్వికారంగా కన్పించాడు. చాలా 'డల్'గా మాట్లాడి, వెళ్తున్నప్పుడు

''... సార్ మిమ్మల్ని మరోసారి శ్రమ పెడ్తున్నాననుకోకపోతే... '' అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు.

''... ఏమిటండి...?'' అడిగాను.

''... నేనో కథ రాసానండి...'' కాగితాలు టేబుల్ మీద పెట్టాడు.

''...ఇందులో శ్రమ ఏముందోయ్... ఇది మా డ్యూటీ...'' ఆ కాగితాలను ఫైల్లో పెడ్తూ-

''... ఇప్పుడు కాస్త పని హడావిడిలో ఉన్నాను... రెండు మూడు రోజుల్లో చదివి చెప్తాను..'' అన్నాను.

''... నరే ... సార్... నేనూ మా ఊరు వెళ్తున్నాను... ఊరు నుండి వచ్చాక కలుస్తాను...'' అని వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు రమణ రాసిన కథ చదివాను. బాగా నచ్చింది కథ. తల్లి ప్రేమ గురించి రాసిన కథ. శైలి కథకి ప్రాణం పోసింది. కష్టపడి కొడుకుని చదివిస్తుంది తల్లి. అతను పట్నంలో ఏదో చిన్న ఉద్యోగం చేస్తుంటాడు. హఠాత్తుగా తల్లికి సీరియస్‌గా వుందని టెలిగ్రామ్ వస్తుంది. ఉద్యోగం మరో వారం రోజుల్లో 'కన్‌ఫర్మ్' చేస్తారు. ఒక వైపు జన్మనిచ్చిన తల్లి, మరోవైపు బ్రతుకు తెరువు. తీవ్రమైన మానసిక సంఘర్షణకి లోనై, టెలిగ్రామ్ వచ్చిన రాత్రికి రాత్రే కంపెనీలో పనిచేస్తున్న మిత్రుడితో విషయం చెప్పి, రైలు ఎక్కాడు. పల్లెటూళ్ళో శ్రమపడినా తల్లి దక్కుతుంది. కొడగట్టి పోతున్న తల్లి ప్రాణం కొడుకుని చూసుకొనే సరికి నిలబడుతుంది. మృత్యు ముఖం నుండి బైటపడ్డ తల్లిని చూసేసరికి వుద్యోగం పోతుందేమోనన్న బాధవుండదు. సురనాథ పీఠం వరించిన అనుభూతి కలుగుతుంది. ఆ ఆనందానుభూతిలోనే కొడుకు వుండడంతో కథ ముగుస్తుంది. చాలా అద్భుతంగా అన్పించింది. తల్లి కొడుకుల ప్రేమ మీద ఇప్పటి దాకా ఎన్నో కథలు వచ్చాయి. అందమైన ఆప్యాయతల్ని ఆవిష్కరించాయి. అయినా ఎప్పుడూ కొత్తగానూ, నిత్య నూతనంగానూ వుంటాయి. మానవ జీవన సంబంధాలే అపురూపమూ, అమూల్యమూ, అందులో అమ్మ ప్రేమ అనంతమైన అమృతభాండం. ఆ కథని వెంటనే మా ఎడిటర్‌కి చూపెట్టి, వచ్చే సంచికలోనే ప్రచురిస్తే బాగుంటుందన్నాను. ఎడిటర్‌గారు గ్రీన్ సిగ్నల్ యిచ్చారు.

రమణ అంత మంచి కథ రాసిన్నందుకు అభినందించడానికి సిద్ధంగా వున్నాను.

సాధారణంగా వారంలో ఒక్కసారైనా కన్పించే రమణ, ఈ సారి పది రోజులు దాటినా రాలేదు. విషయం తెలీలేదు. ఈ రోజు ప్రొద్దుట నుండి పని ఎక్కువగా ఉంది.

''నమస్తే సార్...'' మెల్లగా పిలుపు విన్పించిన వైపు చూశాను. చూసిన వెంటనే గుర్తు పట్టలేనట్టుగా రమణ.

''...నమస్తే... రారా... కంగ్రాట్యులేషన్స్...'' అంటూ సీట్ లోంచి లేచి, షేక్ హేండ్ యిచ్చి–

''అద్భుతమైన కథ రాశావోయ్... పబ్లిష్ కూడా అయింది...'' అంటూ టేబుల్ మీద వున్న పత్రిక నందుకుని పేజీలు తిప్పి, అతనికి చూపెట్టి...

''...పద... ఇంత మంచి కథ రాసినందుకు... ఓ చిన్న పార్టీ యిస్తాను...'' అంటూ అతని భుజమ్మీద చేయివేస్తూ క్యాంటిన్ వైపు కదిలాను.

ప్రచురింపబడిన కథని చూస్తూ, ఆపుకోలేని 'ఆనందాశ్రువులు' ఆపే ప్రయత్నం చేస్తూ... మాటలు రానట్టుగా వుండిపోయాడు. ''ఇంత మంచి కథ ఎలా రాశావోయ్...'' చనువుగా అడిగాను. రెండు నిముషాల నిశ్శబ్దం తరువాత–

''నా కథే రాశాను సార్...'' నెమ్మదిగా అన్నాడు.

''... నీ కథా?'' ఆశ్చర్యం.

''...అవునండి... అందులో తల్లి మా అమ్మ.... కొడుకు నేను.''

''... జీవితంలోంచి వచ్చిన కథ కనుకే అంత బాగుంది...'' మనసారా అభినందిచాను.

''... కానీ... కథలో ముగింపు నా నిజ జీవితానికి చాలా దూరంగా వుంది సార్...'' కన్నీటి గొంతులో జీర.

''... అంటే?'' అర్థం కాన్నట్టు చూశాను.

''... కథలో చివర అమ్మ బ్రతికింది... కానీ... నిజానికి నా తల్లి...'' ఇక మాట్లాడలేనట్టు ఆగిపోయాడు. అతని కళ్ళలోని విషాద సాగరాల్ని ఆనందాశ్రువులనుకున్న నా గుండె చివుక్కుమంది. ఏమీ మాట్లాడ లేకపోతున్నా అతని కన్నీటి చుక్కలు జీవన మహాకావ్యం లోని విషాద వర్ణాల్లా వున్నాయి!!!



కొత్తగా పట్నం కాలేజీలో చేరిన రాజు తల్లిదండ్రులకు ఇలా టెలిగ్రాం ఇచ్చాడు.

''డియర్ అమ్మా, నాన్నా! ఈమధ్య మీ నుండి ఉత్తరాలేమి లేవు. వెంటనే వెయ్యి రూపాయలు మనియార్డర్ చేయండి. దాన్నిబట్టి మీరు క్షేమంగా ఉన్న విషయం తెలుసుకుంటాను.

\- ఎ. స్వరూప, అమీర్‌పేట